క్లుప్తంగా

ప్రజల దర్శనానికి పుష్ప లింగం



పుష్పలింగాన్ని ప్రారంభిస్తున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం(ఓం శాంతి భవనం)లో మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రజల సందర్శనార్థం పుష్పలింగాన్ని ఏర్పాటు చేశారు. ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఈ పుష్పలింగాన్ని ప్రారంభించారు. ఈ నెల 7, 8, 9 తేదీలలో ప్రజలు సందర్శించేందుకు అవకాశం కల్పించినట్టు బ్రహ్మకుమారి రాజేశ్వరి తెలిపారు.

అంగరలో కేంద్ర బలగాల కవాతు



వడ్లమూరులో కవాతు చేస్తున్న సాయుధ బలగాలు

కపిలేశ్వరపురం: అంగర పోలీస్ స్టేషన్ పరిధిలో సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో మండపేటకు కేటాయించిన 90 మందితో కూడిన కేంద్ర సాయుధ సిబ్బంది గురువారం కవాతు నిర్వహించారు. అంగర పోలీస్ స్టేషన్ పరధిలోని వల్లూరు, కాలేరు, వడ్లమూరు గ్రామాల వీధుల్లో కవాతు చేశారు. ఉన్నతాధికారులు ఆదేశాలపై ఎన్నికలు నేపథ్యంలో కవాతు నిర్వహించినట్టు అంగర ఎస్సై అందే పరదేశి తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



మాచవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాయవరం: మాచవరం గ్రామంలోని ఐసీడీఎస్.మాచవరం సెక్టార్ పరిధిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్లు పి.సునీతాకుమారి, వి.విష్ణుకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన ర్యాలీలో వార్డు సభ్యురాలు డి.కుసుమ, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

రామచంద్రపురం: నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సిబ్బందికి ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ నేతృత్వంలో స్థానిక వీఎస్ఎం కళాశాలలో గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల్లో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు. మూడు మండలాలకు చెందిన తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని శ్రీరామ హిందూ మున్సిపల్ యూపీ పాఠశాలలో శనివారం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవళ్ల సత్యనారాయణ, పెంకే గోవిందరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్టు వారు తెలిపారు.

వైద్యురాలు, మహిళా సిబ్బందికి సత్కారం

రామచంద్రపురం రూరల్: మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం ద్రాక్షారామ పీహెచ్‌సీ ఆవరణలో డివిజన్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ప్రశాంతి, మహిళా సిబ్బందిని గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.సందీప్‌నాయుడు, సూపర్‌వైజర్ ఎస్.గంగాధర్, డీపీఎంఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సంబరానికి సిద్ధం

- నేడు మహాశివరాత్రి వేడుకలు
- రెండు నియోజకవర్గాల్లో ముస్తాబయిన ఆలయాలు
- క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు పూర్తి



ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారు



సుందరమైన పదమర ఖండ్రికలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయం



కోరుమిల్లి అష్ట సోమేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు



సోమేశ్వరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



వెంటూరులో వేంచేసి ఉన్న ఉమా సోమేశ్వరస్వామి



ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

కపిలేశ్వరపురం: మహాశివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు, ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలకు మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని శివాలయాలు వేడుకలకు ముస్తాబవుతున్నాయి. శివన్నామ స్మరణతో కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. స్వామిని స్వయంగా దర్శించుకునేందుకు శివరాత్రి వేళ భక్తులు శివాలయాల బాట పడతారు. భక్తిపారవశంతో అభిషేకాలు చేస్తారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పంచారామాల్లో ఒకటైన శ్రీమాణిక్యాంబికా సమేత భీమేశ్వరస్వామి ఆలయం పార్శనస్యం కలిగింది. సోమేశ్వరాలయాల్లో నాలుగో ఆలయం కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లిలో ఉంది. కోటిపల్లిలో శివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. అంతటి ప్రాశస్త్యం గల రెండు నియోకవర్గాల్లో శివరాత్రిని ఘనంగా జరుపుకొంటారు.

ఏర్పాట్లు ఇలా...

ఆలయాల్లో గురువారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, శుక్రవారం మహా శివరాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లను పూర్తి చేసింది. పుణ్య స్నానాలకు రేవులను సిద్ధం చేసింది. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో పేరెన్నికగన్న శివాలయాలెన్నో ఉన్నాయి. రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ ఈనెల 2న శివరాత్రి ఏర్పాట్లుపై దేవదాయ, పోలీస్, పంచాయితీరాజ్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన ఆదేశాలు మేరకు రెండు నియోజకవర్గాల్లోని గ్రామాల రేవులను శుభ్రం చేసి, పుణ్య స్నానాలు చేసేందుకు అనువుగా మెరుగుపర్చారు.

ముస్తాబైన ఆలయాలు

రాయవరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమేశ్వరంలో ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో ఏటా వర్తక సంఘం ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో పంచాయతన మహా రుద్రయాగం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పసలపూడి, వి.సావరం, చెల్లూరు, మాచవరం శివాలయాల్లో కూడా శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని సోమేశ్వరం, వెంటూరు గ్రామాలలో ఉన్న సోమేశ్వరాలయాలు చంద్రుడి ప్రతిష్ఠతో వెలసిన ఆలయాలుగా ప్రాముఖ్యత పొందాయి. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న రెండు ఆలయాలు ద్రాక్షారామ భీమేశ్వరునికి వాయువ్యాన సోమేశ్వర ఆలయం, పడమట దిక్కున వెంటూరు ఆలయం ఉన్నాయి. ఈ రెండు చంద్రుడు ప్రతిష్ఠించాడనే కథ ప్రాచుర్యంలో ఉంది.

భీమేశ్వరాలయంలో ...

రామచంద్రపురం రూరల్: పంచారామాలు, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా భాసిల్లుతున్న భూకైలాసం ద్రాక్షారామంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారి దేవాలయం నేటి మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. మహాశివరాత్రి పర్వదినాన ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారిని దర్శిస్తే పాపాలు హరించి, కోర్కెలు నెరవేరతాయని శివ భక్తుల ప్రగాఢ విశ్వాసం. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తుతారు. ఆలయంలో తెల్లవారుజామున 2.30 గంటలకు సప్తగోదావరి నుంచి తీర్థపు బిందె తీసుకుని వచ్చి, సుప్రభాత సేవ, ప్రాతఃకాల అర్చన, బాలభోగం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 33 మట్టి కుండలతో అభిషేక ద్రవ్యాలు, సప్త నదుల జలాలు, ద్రాక్షారామ పరిసరాల్లోని 12 గుండాల నుంచి సేకరించిన జలాలతో తెల్లవారుజాము 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఏకాదశ రుద్ర హోమం, పూజలు నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజలు జరుగుతాయి. రాత్రి 11.30కు స్వామికి రాజభోగం సమర్పిస్తారు. అప్పటి నుంచి రాత్రి 12 వరకు దర్శనానికి విరామం ఇస్తారు. 12 గంటల నుంచి రాత్రి 1.30 వరకు స్వామివారి లింగోద్భవ దర్శనానికి అనుమతిస్తారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని కొబ్బరాకులతో చలువ పందిళ్లను వేశారు. కూలర్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ, మంచినీరు, పులిహోర, చక్కెర పొంగలి, బిస్కట్లు ఇచ్చేలా సేవాదళాలను సిద్ధం చేశారు.

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలకు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అండ్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కొలంక, జగన్నాథగిరి గ్రామాల్లో శివాలయాలున్నాయి. పరిసర గ్రామాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు వసతులు సమకూర్చినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

శివరాత్రికి కోటిపల్లిలో సర్వం సిద్ధం



ఛాయా సోమేశ్వరస్వామి

కె.గంగవరం: మహాశివరాత్రి సందర్భంగా కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోటిపల్లిలోని గౌతమి గోదావరి నది పుష్కర ఘాట్ వద్ద భారీ బందోబస్తు మధ్య పుణ్యస్నానాలు ఆచరించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు లక్షన్నర మంది వస్తారని అంచనా ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గత ఈతగాళ్లు, పడవలు ఏర్పాటు చేసి, గస్తీ నిర్వహించనున్నారు. ఆలయం వద్ద క్యూలైన్ల వద్ద భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో ఆటంకం రాకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది కూడా వీఐపీ దర్శనం రద్దు చేశారు. భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. నిత్యాన్నదాన సైడా సత్రం, సత్యసేవ సంస్థలు, కమ్మ సంఘం, ఆర్యవైశ్య సంఘం, వెల్ల గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ, బ్రహ్మసంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయం వద్ద, గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్‌రావు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు రామచంద్రపురం సీఐ పి.దొరరాజు, ఎస్సై జానీబాషా తెలిపారు. శనివారం ఉదయం వరకు పోలీసులతో గట్టి బందోబస్తు నిర్వహిస్తామన్నారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈఓ ఎం.శ్రీదేవి తెలిపారు. క్యూలైన్ల వద్ద భారీ గేట్లు, టెంట్లు ఏర్పాటు చేశామన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం సాధ్యం
- పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



శీలంవారిసావరంలో సూర్యప్రకాశ్ కు స్వాగతం పలుకుతున్న మహిళలు

రామచంద్రపురం: పేదల సంక్షేమమే ధ్యేయంగా, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 6వ వార్డు శీలంవారిసావరంలో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వింటూ, వాటి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఎన్నో విమర్శలు చేసిన ప్రతిపక్షాలు.. ఇప్పుడు ఎన్నికలు వచ్చాక వాటిని మేమూ అమలు చేస్తామంటూ చెప్పటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదనే సంగతిని ప్రజలు మర్చిపోలేదన్నారు. మంచి జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలంటూ దమ్మున్న నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు వస్తున్నారని, ఆయనను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కేతా సుజాత, బొక్కా సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ శీలం గంగరాజు, సర్పంచ్‌లు మల్లిమొగ్గల శ్రీధర్, కట్టా గోవిందు, పట్టణ పార్టీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు రెడ్డి గోవిందు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, కడలి కొండయ్య, రెడ్డి శ్రీను, కుడిపూడి సుబ్రహ్మణ్యం, గుడాల లక్ష్మీనారాయణ, న్నుబోయిన తరుణ్, రెడ్డి నాగసుబ్రహ్మణ్యం, పంపన సూరిబాబు, కాళ్ల నాగు, పితాని రాధాకృష్ణ, కడలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- పసలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పసలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

రాయవరం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల పేర్కొన్నారు. పసలపూడిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైన ప్రభుత్వమన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించి, మరోసారి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు వెంట వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీలు కర్రి విజేత, కోట శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు, సొసైటీ అధ్యక్షుడు చింతా రామ్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిన్నం అపర్ణాదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ తవిటికి రత్నకుమార్, కోకన్వీనర్ చింతా సురేష్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల శాఖ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సత్తి పద్దారెడ్డి, మల్లిడి రామారెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, సినీ నిర్మాత తాడిగని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై మహా శివుడు



రామచంద్రపురం రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్ గురువారం రావి ఆకుపై బ్లేడుతో మహా శివుని చిత్రాన్ని మలిచారు. పలువురు ఆయన ప్రతిభను అభినందించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

కాజులూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికలో మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేలా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నేత, గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ అన్నారు. గ్రామంలో గురువారం స్థానిక ఎంపీటీసీ జొన్నకూటి పద్మజావెంకటేశ్వర్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి, మాజీ చైర్మన్ మాదిరెడ్డి చిట్టిబాబు, మాదిరెడ్డి పృథ్వీ, పార్టీ మండల యువజన విభాగ ప్రధాన కార్యదర్శి నిమ్మితి విజయ్, ఉంగరాల శివ, టేకుమూడి దుర్గారావు, చొల్లంగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలపై ప్రత్యేక శ్రద్ధ

- మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ
- మండపేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం



మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో పారిశుద్ధ్య పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో కమిషనర్ బి.రాము అజెండాను వివరించారు. కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు పలు అంశాలను ప్రస్తావించారు. టీడీపీ కౌన్సిలర్లు పలు పారిశుధ్య సమస్యలను ప్రస్తావించగా పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు సమాధానంగా చెప్పారు. రెండో విడతగా మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.72.75 లక్షల నిధులను పట్టణాభివృద్ధికి కేటాయిస్తూ పలు నిర్ణయాలు తీసుకోగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్ పర్సన్ నూకదుర్గా రాణి మాట్లాడుతూ కౌన్సిల్ ప్రజాప్రతినిధులు, కమిషనర్, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు అన్ని వార్డుల్లోని పారిశుధ్యం మెరుగుకు విశేష కృషి చేస్తున్నారన్నారు. సిబ్బంది పనితీరును పారిశుధ్య పనుల తనిఖీదారు లావణ్య వివరించారు. మున్సిపల్ శాఖల అధికారులు వారివారి విభాగాలకు చెందిన సమాచారాన్ని వెల్లడించారు.

సమష్టిగా సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ సీపీ పట్టణ శ్రేణుల సమావేశం



మండపేటలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): సమష్టి శ్రమతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపిద్దామని, అందుకు వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు సంసిద్ధమై పనిచేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాల్‌లో గురువారం వైఎస్సార్ సీపీ పట్టణ శ్రేణుల సమావేశం నిర్వహించారు. పార్టీ వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ పలు విభాగాల నాయకులు, క్రియాశీలక నేతలు, కార్యకర్తలుకు ఎమ్మెల్సీ తోట దిశా నిర్దేశం చేశారు. వార్డులు వారీగా పార్టీ పటిష్టతకు సంబంధించిన అంశాలపై కార్యకర్తలుతో చర్చించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ చల్లా ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ, మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి, కౌన్సిలర్ల కృషితో పట్టణం విశేషంగా అభివృద్ధి అయ్యిందన్నారు. పట్టణ ప్రజల వద్దకు వెళ్లే సంపూర్ణ హక్కు వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఉందని, ప్రణాళికాబద్ధంగా ప్రజల్లో పనిచేయాలని సూచించారు.మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కార్యకర్తల పనితీరు అత్యంత కీలకమైందని, ఎప్పటికప్పుడు నాయకులతో సమన్వయంతో పని చేస్తూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు, పీఏసీఎస్ చైర్మన్లు, నాయకులు నక్కా సింహాచలం పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో చిత్రలేఖన పోటీలు

రామచంద్రపురం రూరల్: నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పాఠశాల డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు మహిళా సాధికారత, ప్రకృతి దృశ్యాలు, పర్యావరణ సమస్యలు, సేవ్ వాటర్ అంశాల్లో చిత్రాలను వేశారు. సీనియర్స్ విభాగంలో బి.వర్షిత, పి.రాజారత్నం, బి.భాగ్యశ్రీ, జూనియర్స్ విభాగంలో సీహెచ్ తులసి, జి.కీర్తన, డి.నవసంధ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందారు.



నరసాపురపుపేటలో చిత్రలేఖనంలో విజేతలైన విద్యార్థులు

దళితులంతా వైఎస్సార్ సీపీ వెంటే..



గొల్లపాలెం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

కాజులూరు: రాష్ట్రంలో దళితులంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని కాజులూరు మండల గ్రామాలకు చెందిన పలువురు ఎస్సీసెల్ నేతలు పేర్కొన్నారు. మండలంలోని పలువురు దళిత నాయకులు సంఘటితమై గత 20 రోజులుగా వివిధ గ్రామాల్లో పర్యటించి, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పేదలకు అందుబాటులోకి వచ్చిన పథకాలు, జరిగిన అభివృద్ధిపై విస్తృత ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఓటువేసి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ తొలివిడత ప్రచారం చివరిరోజు కార్యక్రమంలో భాగంగా గురువారం గొల్లపాలెం కొంగోడు రోడ్‌లో దళిత నాయకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 117 మందికి ఉద్యోగాలు

పి.గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక లక్ష్మి ఐటీఐ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. సంస్థ జిల్లా మేనేజర్ పి.లోక్‌మాన్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొన్నాయి. 346 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 117 మందికి ఉద్యోగాలు లభించాయి. రెండో రౌండ్ ఇంటర్వ్యూలకు 80 మంది ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఇ.వసంత లక్ష్మి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ రవిచంద్ర, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి చిన వెంకటలక్ష్మి, వైపీ రాజకుమార్ పాల్గొన్నారు.